ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 6 ఆగస్టు 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

ఓడీఎఫ్ సర్వేలో రాష్ట్రంలోనే జిల్లా ఫస్ట్

- ఏలూరు జిల్లాలో 96.66 శాతం సర్వే పూర్తి
- బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా ప్రకటించడానికే ఈ సర్వే
- జిల్లాలో ఇప్పటికే స్వచ్ఛభారత్ మిషన్ కింద 2,05,817 మంది లబ్ధిదారులకు మరుగుదొడ్ల ఏర్పాటు
- 627 గ్రామాల్లో ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటన



ఏలూరు సిటీ, ఆగస్టు 5 : రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలను బహిరంగ మల విసర్జన లేని గ్రామ పంచాయతీలుగా చేసేందుకు ఏపీ ఓడీఎఫ్ (ఓపెన్ డిఫెక్షన్ ఫ్రీ) సర్వే-2024 ను ప్రభుత్వం చేపట్టింది. ఈ ఓడీఎఫ్ సర్వేలో రాష్ట్రం లోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానం సాధిం చింది. ఈ సర్వేను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించడంతో జిల్లాలో ఈ సర్వే త్వరిత గతిన జరిగిందని చెబుతున్నారు. ఆగస్టు 15 వరకు సమయం ఉన్నా ఇప్పటికే జిల్లాలో ఈ సర్వే 96.66 శాతం పూర్తికావడంలో పంచాయతీ అధికా రులు, సిబ్బంది పాత్ర ఎంతో ఉందని చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా పంచాయతీ అధికారి తమ సిబ్బందితో ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించారు. గతంలో ఉమ్మడి పశ్చి మ గోదావరి జిల్లా ఉండగానే ఓడీఎఫ్ ప్లస్ జిల్లాగా ప్రకటించబడింది. అయితే పెరుగుతున్న అవసరాల దృష్ట్యా కుటుంబాల సంఖ్య పెరుగుతుండడం, దానికి అనుగుణంగా వ్యక్తిగత మరుగుదొడ్ల అవసరం రావడంతో మళ్లీ వ్యక్తిగత మరుగు దొడ్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కన పెట్టటంతో ఇప్పుడు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఓడీఎఫ్ సర్వేను నిర్వహించి ఇప్పటికీ ఎంత మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరం అవుతాయో తేల్చాలని నిర్ణయించింది.

- జిల్లాలో 543 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో 536 గ్రామాల్లో ఈ సర్వే జరిగింది. జిల్లాలో లక్షా 88వేల 655 ఇళ్లకు సంబంధించి సమాచారాన్ని సేకరించారు. 724 గ్రామాల్లో సర్వే పూర్తయింది. ఇంకా 25 గ్రామాల్లో సర్వే పూర్తికావాల్సి ఉంది. ఇప్పటికి అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 96.66 శాతం సర్వే పూర్తికాగా జిల్లాలో నిర్వహించిన ఈ సర్వే ఆధారంగా పరిశీలిస్తే రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.
- జిల్లాలోని 3,81,584 ఇళ్లకు గాను స్వచ్ఛభారత్ మిషన్ కింద ఇప్పటివరకు 2,05,817 మంది లబ్ధిదారులకు మరుగుదొడ్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా జిల్లాలో 3,985 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. జిల్లాలో 412 సామూహిక మరుగుదొడ్లు గ్రామ సచివాలయాల వద్ద నిర్మించడానికి ఆమోదం ఇచ్చామన్నారు. అందులో 394 సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయిందని, 18 మరుగు దొడ్ల నిర్మాణం పురోగతిలో ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 627 గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా ప్రకటించినట్టు వివరించారు.



సదస్సులో పాల్గొన్న సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. హాజరైన కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్



జిల్లా అభివృద్ధికి ప్రణాళిక

సిద్ధం చేయండి

కలెక్టర్, ఎస్పీలతో సీఎం చంద్రబాబు

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర ముఖ్య అధికారులు, మంత్రులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యక్తిగతంగా పని తీరు, సమర్థత సంతృప్తి కరంగా ఉండేలా ప్రజలకు యంత్రాంగం చేరువయ్యేలా ఎప్పటికప్పుడు ఆలోచనలు, వాటి ఆచరణలు ప్రజలు మెచ్చేలా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

- ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి
- అందులోను మీ పాత్ర ఉండాలి
- ప్రతీ విషయంలోను ఆచితూచి వ్యవహరించండి
- జిల్లా అభివృద్ధే ధ్యేయంగా.. ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మీ నిర్ణయాలు ఉండాలి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

'జిల్లాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.. వాటి అమలుకు వీలుగా కలెక్టర్ కష్టపడి పనిచేయాలి.. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వంపై పెంచుకున్న ఆశలు నెరవేరేలా యంత్రాంగాన్ని నడపాలి'.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్లుగా, ఎస్పీలుగా పనిచేసేవారంతా ఒక నిబద్ధత, పక్కా ప్రణాళికతోముందుకు వెళ్లడమే కాకుండా తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో ఏది మంచో, ఏది చెడో నిర్ధారించుకుని తగు విధంగా స్పందించాలని పిలుపునిచ్చారు. వాస్తవానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో జిల్లాల వారీగా పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, ఆ దిశగానే ఎప్పటికప్పుడు సరికొత్త ఆలోచనలు, ఉద్యోగ కల్పన, సామాన్యుల సమస్యలు తీర్చడంలో సంతృప్తి స్థాయిలో వ్యవహరించాల్సిన బాధ్యత మీదే నంటూ దిశా నిర్దేశం చేశారు. ఏకబిగిన వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు ఏపీ సచివాలయంలో సుదీర్ఘ సమీక్ష చేశారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను మరింత చొరవగా అమలు చేసేందుకు అనువైన పరిస్థితులు నెలకొనేలా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని ఆయన గుర్తు చేశారు. అన్న క్యాంటీన్లు ఈనెల 15 నుంచి ఆరంభించనున్నందున చర్యలు తీసుకోవాల్సిందిగా సూచనలు చేశారు. ప్రత్యేకించి కీలక పథకాల అమలులో ఎప్పటికప్పుడు తగు రీతిలో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ పదేపదే జిల్లా కలెక్టర్, ఎస్పీలకు గుర్తు చేశారు. ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశం కల్పించడంలో, ఇతర సమస్యలు మీ దృష్టికి వచ్చిన వెంటనే లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచనలు చేశారు. ప్రత్యేకించి యంత్రాంగంలో సేవా భావం పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రతినిధి సమస్యలు మీ దృష్టికి తీసుకు వస్తే దానిలో ఉన్న అసలు విషయాన్ని గ్రహించాలని, తక్షణమే చర్యలకు ఉపక్రమిస్తే కలెక్టర్‌గా మీకు సంతృప్తి, సమస్యను పరిష్కరించామన్న తృప్తి ప్రజా ప్రతినిధులకు ఉంటుందని ఉద్బోధించారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ కూడా తమదైన శైలిలోనే స్పందించారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగం వీక్షణ

ఏలూరు సిటీ : ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ల సదస్సు జరిగింది. ఈ మేరకు సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగ కార్యక్రమాన్ని ఏలూరు కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ ధాత్రి రెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు.

అదనపు తరగతులపై హెచ్‌ఎంల హడావుడి

- అటువంటి ఉత్తర్వులేవీ లేవన్న డీఈవో

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : పాఠశాల అకడమిక్ కేలండర్‌కు విరుద్ధంగా కొన్ని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు అదనపు తరగతులను నిర్వహించడానికి ప్రయత్నాలు చేయడం సోమవారం జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల్లో కలవరాన్ని రేపింది. నిర్ణీత అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలలు ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకే పనిచేస్తే సరిపోతుందని, సాయంత్రం 5 గంటల వరకు పిల్లలను ఆటలాడించేందుకు స్కూలు పీఈటీ/పీడీ ఉండాల్సిందేనని డీఈవో అబ్రహం వివరణ నిచ్చారు. ఇటీవల విడుదలైన అకడమిక్ కేలండర్ ప్రకారం చదువులో వెనుకబడిన విద్యార్థుల (డల్ స్టూడెంట్స్)కు అదనంగా బోధించేందుకు వీలుగా చివరి పీరియడ్‌ను రెమిడియల్ క్లాసుగా వినియోగించుకోవాలని విద్యాశాఖ సూచించింది. ఇదికాస్తా క్షేత్రస్థాయిలో కొందరు హెచ్‌ఎంల్లో సందిగ్ధతకు దారితీసింది. ఈ క్రమంలో సోమవారం విధులకు హాజరైన హైస్కూలు ఉపాధ్యాయులను సాయంత్రం 5 గంటలవరకు పాఠశాలలోనే ఉండాలంటూ కొందరు ప్రధానోపాధ్యాయులు హుకుం జారీ చేయడంతో కలవరానికి దారితీసింది. పాఠశాల పనివేళలు ముగిసిన తర్వాత సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు రెమిడియల్ క్లాసులు నిర్వహించడానికి ప్రభుత్వం ఉత్తర్వులేవైనా జారీ చేసిందా అంటూ వాకబు చేశారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయ వర్గాల వద్ద సంప్రదించగా అటువంటి జీవోలు జారీ కాలేదని వివరణ ఇచ్చారు. దీనిపై డీఈవో అబ్రహంను వివరణ కోరగా 'అదనపు తరగతులనేవి ఐచ్ఛికమేతప్ప ఎటువంటి జీవోలు లేవు. సాయంత్రం 4నుంచి 5గంటల వరకు ఉపాధ్యాయులు తరగతులు తీసుకోవాలని మేం ఎక్కడా చెప్పలేదు. ఈ సమయంలో విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయులు ఆటలాడించాలని ఉత్తర్వులు ఉన్నాయి' అని వివరించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలున్న విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షకు అర్హులని వివరించారు. పరీక్ష ఈ ఏడాది డిసెంబరు 8న జరుగుతుందని, నిర్ణీత పరీక్ష రుసుంను చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 6వ తేదీ వరకు గడువు ఉందన్నారు. వివరాలకు బీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్ లేదా ఏలూరు డీఈవో కార్యాలయంలో గాని సంప్రదించాలని కోరారు.

నిలకడగా గోదావరి

పోలవరం, ఆగస్టు 5 : పోలవరం ప్రాజెక్టు వద్ద కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడిన గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,30,844 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ఎల్‌ఎండీపేట కొవ్వాడ రిజర్వాయర్‌లో నీటిమట్టం 89.40 మీటర్లు నమోదైందని, ఆ నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 120 క్యూసెక్కుల జలాలు మాత్రమే దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి..

పారితోషికాలు ఏవి?

- ఆవేదన వ్యక్తం చేస్తున్న బీఎల్‌వోలు

ఏలూరు రూరల్, ఆగస్టు 5: ఎన్నికల విధులు నిర్వహించిన కిందిస్థాయి సిబ్బంది చిరుద్యోగులకు ఇవ్వాల్సిన పారితోషికాలు ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుతీరి నెలరోజులైనా ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1,744 పోలింగ్‌స్టేషన్‌లు ఉండగా ఏలూరు నియోజకవర్గ పరిధిలో 213 పోలింగ్‌స్టేషన్‌లు ఉన్నాయి. ఎన్నికలకు వందల సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేశారు. పైస్థాయిలో పనిచేసిన కొందరు అధికారులకు కొంత మొత్తం దక్కినా కిందిస్థాయిలో బీఎల్‌వోలుగా పనిచేసిన వారికి రిక్తహస్తమే మిగిలింది. బీఎల్‌వోలుగా పంచాయతీ కార్యదర్శులు, గ్రామవార్డు సచివాలయ కార్యదర్శి కొన్నిచోట్ల అంగన్‌వాడీ వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది పనిచేశారు. పోలింగ్ రోజు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సౌకర్యాలు కోసం ఇచ్చిన రూ.ఐదు వేలు మినహా వారి సేవలకు ఎటువంటి పారితోషికం అందలేదు. ఎన్నికల కోడ్ వచ్చాక పూర్తిగా బాధ్యతలు బీఎల్‌వోలపై పడ్డాయి. నిద్రాహారాలు లేకుండా పాటు పడ్డారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం, ప్రోగ్రామింగ్, పలు విడతల శిక్షణలో పాల్గొన్నారు. ఇంత చేసినా కనీసం తమ సేవలకు గుర్తింపు లేకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఎల్‌వోలకు రెండేళ్లుగా నెలకు రూ.500 చొప్పున ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇవ్వలేదు. ఎన్నికల రెండు రోజులకు రూ.500 మాత్రమే ఇచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పారితోషికం అందలేదు. వీరంతా చిరుద్యోగులు. వివిధ శాఖలకు చెందిన వారు కావడంతో ఉన్నతాధికారులను గట్టిగా అడిగేందుకు సాహసించడం లేదు. వీరితో పాటు పోలింగ్ స్టేషన్‌లో కరెంటు పనులు, కేటరింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రాఫర్లకు సంబంధించిన బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ఎన్నికల సమయంలో పనిచేసిన తహసీల్దార్లు సంబంధిత గౌరవ వేతన ఫైళ్లపై సంతకాలు చేయకుండానే ఇటీవల బదిలీ కావడంతో తమ పరిస్థితి ఏంటని ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు వాపోతున్నారు. ఇటీవల బీఎల్‌వోలుగా చేసిన వారికి ఇవ్వాల్సిన గౌరవ వేతనం తక్షణం ఇవ్వాలని, మూడేళ్ల నుంచి పెండింగ్ ఉన్న నిధులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేసినా ఇప్పటి వరకు ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న మొక్కజొన్న రైతులు

నకిలీ విత్తనాలతో నట్టేట ముంచారు

- పంట డబ్బులివ్వకుండా ఇబ్బందులు..
- దళారులపై చర్యలు తీసుకోవాలి
- పురుగుల మందు డబ్బాలతో రైతుల ఆందోళన

ద్వారకాతిరుమల, ఆగస్టు 5: నకిలీ విత్తనాలను అంటగట్టడమే కాకుండా మొక్కజొన్న పంట డబ్బులను దళారులు తమకివ్వకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని, జిల్లా అధికారులు స్పందించకుంటే తమకు పురుగుల మందులే దిక్కంటూ కొందరు రైతులు సోమవారం ఆందోళన చేశారు. సీహెచ్ పోతేపల్లి పొలాల్లో వారు పురుగుల మందుల డబ్బాలతో ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాలివి... సీహెచ్ పోతేపల్లి, ఈస్టు యడవల్లి గ్రామాలకు చెందిన రైతులు కొందరు దళారుల వద్ద మొక్కజొన్న విత్తనాలు తీసుకున్నారు. ఎకరాకు ఐదు నుంచి ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తుందని, రూ.80వేలకు మించి ఆదాయం వస్తుందని దళారులు నమ్మబలికారన్నారు. తీరా పంటకోత సమయానికి మూడు టన్నుల లోపే దిగుబడి వచ్చిందని, నకిలీ విత్తనాలతో తమను నట్టేట ముంచారని ఆవేదన చెందారు. మరోవైపు పండిన పంటను వారు తీసుకుని నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు తమకు డబ్బులు చెల్లించలేదని వాపోయారు. అప్పులు చేసి పొలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నామని, దళారులు డబ్బులు చెల్లించకుంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

గడువులోగా అర్జీల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో

ఏలూరు రూరల్, ఆగస్టు 5 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాస్కర్‌రావు, ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 229 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను దరఖాస్తుదారునికి రాతపూర్వకంగా తెలపాలన్నారు. అర్జీల్లో కొన్ని.. తనకు ఉన్న 1.94 సెంట్ల భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన కె.కన్నయ్య కోరారు. తన భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని భీమడోలుకు చెందిన కె.కృష్ణకుమార్ విజ్ఞప్తి చేశారు. తనకు ఆంధ్రప్రదేశ్ భూదాన యజ్ఞబోర్డు కన్నాపురంలో ఐదు ఎకరాల భూమి మంజూరు చేశారని, పట్టా మంజూరు చేసి ఆన్‌లైన్‌లో నమోదు, పట్టాదార్ పాస్‌బుక్ జారీ చేయాలని పోలవరానికి చెందిన ఫణేంద్రకుమార్ కోరారు. గతంలో వృద్ధాప్య పింఛన్ మంజూరు అయిందని తన పేరుమీద రెండు విద్యుత్ కనెక్షన్లు ఉండడంతో రద్దు చేసిన పెన్షన్ పునరుద్ధరించాలని మండవల్లికి చెందిన నాంచారమ్మ కోరారు. దీర్ఘకాలిక రోగుల పెన్షన్ మంజూరు చేయాలని లింగపాలెంకు చెందిన ఎం.సీతారామయ్య విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పేదల ఇళ్లస్థలాల మంజూరులో అవకతవకలపై విచారణ చేసి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ముసునూరుకు చెందిన ఆముదాల రంజిత్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఏఎస్పీ

ఏలూరు క్రైం, : ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు మభ్యపెట్టి ఆశ కల్పించడం కాని భయపెట్టి కాని నేరాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ జి.స్వరూపరాణి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 50 మంది ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చట్ట ప్రకారం పరిశీలన జరిపి న్యాయం చేస్తామన్నారు. సైబర్ నేరాలపై 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యాశాఖలో ఉద్యోగుల మధ్య వివాదం

మా భూముల్ని మాకు ఇప్పించండి

నలుగురికి ఇన్‌ఫ్లూయెంజా

-7లో

రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు అందజేత

- కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, ఆగస్టు 5 : జిల్లాలో సూక్ష్మ సేద్య పథకంలో బిందు,తుంపర్ల సేద్య పరికరాలు ప్రభుత్వ రాయతీపై రైతులకు అందిస్తుందని, ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రం జత చేసి సంబంధిత మండల ఉద్యాన అధికారి/ గ్రామ సహాయ కుడు/ గ్రామ సెరీకల్చర్ సహాయకుడు/ సూక్ష్మనీటి పారుదల ప్రాంత అధికారులతో గాని సంబంధిత గ్రామ రైతు సేవా సంఘం లేదా జిల్లా మైక్రో ఇరి గేషన్ కార్యాలయంలో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 15 వేల హెక్టార్లలో సూక్ష్మసేద్యం లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. 3 ఎకరాలలోపు భూమి ఉన్న సన్నచిన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాలు లోపు భూమి ఉన్న రైతులకు 30 శాతం రాయితీపై అందిస్తార న్నారు. స్ప్రింక్లర్లు సన్నచిన్న కారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీపై అందిస్తారన్నారు.



కుప్పకూలిన ఇండెక్స్

మదుపుదారుల నష్టం రూ.100 కోట్ల పైనే .. స్టాక్ మార్కెట్‌లో బ్లాక్ మండే

స్టాక్ మార్కెట్‌లో మరో బ్లాక్ మండే నమోదైంది. సోమవారం ఇండెక్స్ భారీగా కుప్పకూలడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మదుపుదారులు భారీగా నష్టపోయారు. సుమారు రూ.100 కోట్లు సంపద ఆవిరైనట్లు అంచనా. అన్ని రంగాల షేర్లు భారీగా పతనం అవ్వడంతో మదుపుదారుల్లో భయాందోళన నెలకొన్నది.

నరసాపురం, ఆగస్టు 5: ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం, అమెరికాలో ఆర్థిక మాంద్యం, పెరిగిన నిరుద్యోగం, జపాన్‌లో ఎన్నడూ లేని విధంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితుల ప్రభావం భారత్ మార్కెట్‌పై కూడా పడ్డాయి. దీంతో ఆరంభం నుంచి ఇండెక్స్ పతనం అవుతూ వచ్చింది. కనీసం ఉన్న స్టాక్‌ను అమ్ముకునే ఛాన్స్ కూడా ఇవ్వలేదు. దీంతో మదుపుదారులు ఏం చేయాలో తెలియక సూచిలను చూస్తూ ఉండిపోయారు. ఏ సమయంలో కూడా మార్కెట్‌లో రికవరి కనిపించలేదు. కొవిడ్ సమయంలో మార్కెట్ ఈ తరహాలో పతనమైంది. మళ్లీ ఇప్పుడు అదే రీతిలో పడుతుండటంతో మదుపుదారుల్లో భయం నెలకొంది. జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, భీమవరం, మార్టేరు, పెనుగొండ, ఆకివీడు, ఉండి, తణుకు, టీపీగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో వందల సంఖ్యలో స్టాక్ మార్కెట్ మదుపుదారులు ఉన్నారు. ఇటీవల బడ్జెట్, కొన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో ఇండెక్స్ పెరుగుతూ వచ్చింది. ఈ దశలో చాలా మంది మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ఊహించని విధంగా గత వారంలో అమెరికా జాబ్‌డేటా, పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో సోమవారం ఒక్కసారిగా మార్కెట్ కుప్పకూలింది. మదుపుదారులు ఈపరిస్థితిని ఊహించలేదు. దీంతో రానున్న రోజుల్లో సూచిలు ఏవిధంగా ఉంటాయన్న భయం మదుపుదారుల్ని వెంటాడుతోంది.

యుద్ధం, ఆర్థిక మాంద్యం ప్రభావం

సెప్టెంబరు 1 నుంచి పశుగణన ప్రారంభం

- జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 5: జిల్లాలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పశుగణన నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం పశుగణన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతీ ఐదేళ్లకు ఒకసారి పశుగణన నిర్వహిస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు మాట్లాడుతూ జిల్లాలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, కుక్కల సంఖ్యను లెక్కించి వివరాలు పొందుపరిచేందుకు ప్రత్యేక యాప్ ఏర్పాటు చేశామన్నారు. 417 మంది ఎన్యూమరేటర్లు, 67 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటారని, వీరికి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ హర్ష, డాక్టర్ జాహ్నవి పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టును వైసీపీ నిర్లక్ష్యం చేసింది


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

పోలవరం, ఆగస్టు 5 : జగన్మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టుని నిర్లక్ష్యం చేసి కాఫర్ డ్యాములు ఇరువైపులా మూయకపోవడం వలన డయాఫ్రం వాల్ దెబ్బతినడం, ప్రాజెక్టు నిర్మాణం జాప్యం జరగడానికి కారణమని భారత చైతన్య యువ జన పార్టీ రాష్ట్ర నాయకులు బోడె రామచంద్ర యాదవ్ ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టుని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టులో హిల్‌వ్యూ, స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాములు, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తశుద్ధి లేకుండా రివర్స్ టెండరింగ్ పేరిట వివాదాలు సృష్టించి రూ.600 కోట్లు ఆదా చేశామని కల్లబొల్లి మాటలు చెప్పి జాప్యం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ద్వారా ప్రజలకు రాష్ట్రానికి మంచి చేయాలని కోరారు. ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీల విషయంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు.

పారితోషికం చెల్లింపులో ఇంటర్ బోర్డు కాలయాపన

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియేట్ పరీక్షల విధులు నిర్వహించిన జూనియర్ అధ్యాపకులకు పారితోషకాన్ని ఇంత వరకు చెల్లించకుండా ఇంటర్ బోర్డు కాలయాపన చేస్తోందని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ (పీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్, ఉపాధ్యక్షుడు శ్యాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో పరీక్షల విధుల నిమిత్తం బకాయిపడిన రూ.80 లక్షలను అధ్యాపకులకు చెల్లించకుండా ఇంటర్ బోర్డు స్వాహా చేసిందని ఆరోపించారు. పరీక్షలు ముగిసి నెలలు గడుస్తున్నా బకాయిలు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంపై విద్యాశాఖ మంత్రి లోకేష్ జోక్యం చేసుకుని పారితోషకం బకాయిలను ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వివరాలివ్వండి : ఆర్‌ఐవో

జూనియర్ అధ్యాపకుల యూఐడీ వివరాల ఆధారంగా ఈ ఏడాది పరీక్షల విధుల పారితోషకాన్ని ఇంటర్ బోర్డు నేరుగా సంబంధిత అధ్యాపకుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని ఇంటర్మీడియేట్ విద్యా మండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖరబాబు తెలిపారు. కొందరు లెక్చరర్లు బ్యాంకు ఖాతా సంఖ్యలను తప్పుగా నమోదు చేయడంవల్ల డబ్బులు పడకపోవడంతో, అటువంటివారు తమను సంప్రదిస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. పారితోషకం నిధులను ఇంటర్ బోర్డు స్వాహా చేసిందని ఆరోపించడం సరికాదన్నారు.

నలుగురికి ఇన్‌ఫ్లూయెంజా

ఆకివీడు రూరల్ ఆగస్టు 5 : ఆకివీడు మండలం అజ్జమూరులో ఒక బాలుడుకి ఇన్‌ఫ్లూయెంజా వైరస్ పాజిటివ్ అని ప్రాథమిక పరీక్షలో తేలింది. దగ్గుతో బాధపడుతున్న బాలుడికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ చూపించిందని వైద్య సిబ్బంది తెలిపారు. అయితే ఆ బాలుడికి జ్వరం, రొంప లక్షణాలు లేవన్నారు. ఆకివీడులో ఇద్దరు, కోళ్ళపర్రు, అజ్జమూరులలో ఒక్కొక్కరుతో మొత్తం నలుగురికి పాజిటివ్ వచ్చిందన్నారు. వారి నివాసంలోనే ఐసోలేషన్‌లో ఉంచినట్లు వారు తెలిపారు. అయితే మరొక పరీక్ష నిర్వహించాకే వెల్లడించే అవకాశం ఉందన్నారు. పాజిటివ్ వచ్చిన వారి నివాసాల వద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రధాని మోదీని కలసిన రాష్ట్ర ఎంపీలు


మోదీని కలిసిన మంత్రి శ్రీనివాసవర్మ, పురందరేశ్వరీ, సీఎం రమేష్

భీమవరం టౌన్, ఆగస్టు 5 : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహాయ, సహకారాలు అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరామని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఢిల్లీలో సోమవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరీతో కలిసి మోదీని కలిశామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులను ఆయన వివరించామని చెప్పారు. తాము అడిగిన వాటి ప్రధాని సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా తన తండ్రి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన రైతు వివరాల సేకరణ


ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబ వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పోలవరం, ఆగస్టు 5 : పోలవరం మండలం గూటాలలో శనివారం ఆత్మహత్యకు పాల్పడిన గూటాల కౌలు రైతు పలకంశెట్టి రామకృష్ణ కుటుంబాన్ని సోమవారం వ్యవసాయ శాఖ సంచాలకులు పీజీ బుజ్జిబాబు పరామర్శించి వివరాలు సేకరించారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు తొమ్మిది ఎకరాల వరకూ కౌలుకి భూమి తీసుకుని వ్యవసాయం చేశాడని, సొంత భూ మి అర ఎకరం ఉన్నదని తెలిసిందన్నారు. ఐదేళ్ల నుంచి పండించిన పంటల వివరాలను, రుణాల వివరాలను సేకరించామని తెలిపారు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందని ప్రభుత్వం నుంచి అంద వలసిన సహాయం అందించేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రు సర్పంచ్ అగచాట్లు


నిచ్చెన పట్టుకొని వీధిలైట్లు వేయిస్తున్న సర్పంచ్ పాట్నూరి ఉమా మహేశ్వరరావు

నిడమర్రు ఆగస్టు 5 : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కల కనుచూపు మేరలో తీరేటట్లు లేదు. గ్రామాలలో వర్గ పోరుతో బలహీన వర్గానికి చెందిన గ్రామ సర్పంచ్‌కు పంచాయతీ సిబ్బంది సహకరించకపోవడంతో తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తన పదవికి మచ్చ తెచ్చుకోలేనని భావించి ఎలక్ట్రీషియన్‌తో కలసి విద్యుత్ దీపాల మరమ్మతు పనులను నిర్వహించారు. ఇదేమిటీ సర్పంచ్ గారు మీరే నిచ్చెన మోసు కొని వెళ్తున్నారని గ్రామ స్థులు ప్రశ్నించగా పంచాయతీలో ముగ్గు రు స్వీపర్లు ఉన్నప్పటికీ నిచ్చెన మోయడానికి సహకరించమంటే అది మా పనికాదంటున్నారన్నారు. పంచాయతీ సిబ్బంది, కార్యానిహరణాధికారి సహకరించడం లేదన్నారు. అధికారులు సిబ్బంది కుమ్మక్కై తనను మానసికంగా హింసిస్తున్నారన్నారు. పంచాయతీలో నాలుగేళ్లుగా నిధులు లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర లోటుతో నెట్టుకొస్తున్నారు. పంచాయతీ సిబ్బందికి ఇప్పటికే తొమ్మిది నెలల జీతం బకాయిలు ఉండడంతో వారు సహకరిం చడం లేదని తెలస్తోంది. అంతేగాక కార్యానిర్వహణాధికారి తన సిబ్బందితో పని చేయించుకోలేని దుస్థితి ఇక్కడ నెలకొంది. ఉన్నతాధికారులు ఇప్పటికైన దృష్టి సారించి గాడిలో పెట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటలు వారి.. పెచ్చులూడి..

» అధ్వానంగా వసతి గృహాలు » తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు » కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

వసతుల కొరతతో ప్రభుత్వ వసతి గృహాలు అధ్వానంగా మారుతున్నాయి. శిథిలమైన భవనాలలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కిటికీలకి మెస్‌లు లేకపోవడంతో దోమల బాధతో అల్లాడిపోతున్నారు. బీటలు వారిన శ్లాబు ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళనతో నిద్రకు దూరమవుతున్నారు. ఇక వర్షం వస్తే సరేసరి. విద్యార్థుల గదుల్లోకి నీరు చేరిపోతుంది. వసతి గృహాల్లో తమ పిల్లలు పడుతున్న ఇబ్బందులు చూసిన తల్లిదండ్రులు వారిని తమ ఇళ్లకు తోసుకోని వెళ్లపోవడానికి సమాయత్తమవుతున్నారు.


అధ్వానంగా ఉన్న పెంటపాడు ఎస్సీ బాలికల వసతి గృహం

పెంటపాడు, ఆగస్టు 3 : విద్యార్థులు ఉండే ప్రభుత్వ వసతి గృహాలు వసతుల కొరతతో అధ్వానంగా తయారయ్యాయి. పెంటపాడులో ఎస్సీ బాలురు, బాలికలు, బీసీ బాలురు, పరిమెళ్ళలో ఎస్సీ బాలురు కలిపి మొత్తంగా నాలుగు వసతి గృహాలున్నాయి. వీటిలో పెంటపాడులో ఉండే బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో ఈ భవనాన్ని సచివాలయం-2గా మార్చేశారు. అయితే మిగిలిన మూడు హాస్టల్స్‌లో వసతులు లేక దారుణంగా తయారయ్యాయి. పెంటపాడు బాలికల, బాలుర హాస్టల్ ఒకే ప్రాంగణంలో ఉంటాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఎప్పుడూ కూడా హాస్టల్స్ గురించి పట్టించుకోలేదు. హాస్టల్స్ అభివృద్ధి మాట దేవుడేరుగు.. కనీసం మౌలిక సదుపాయాలే కల్పించలేకపోయారు. దీంతో హాస్టల్ భవనాలు మొత్తం శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల శ్లాబు పెచ్చులుగా ఊడిపోతున్నాయి. దీంతో వర్షం వస్తే చాలు విద్యార్థులు ఉండే గదుల్లోకి వర్షం నీరు వచ్చేస్తుంది. భవనాలపై పిచ్చి మొక్కలు పెరిగిపోయి బీటలు వారుతున్నాయి. కనీసం విద్యార్థులు ఉండే కిటికీలు, తలుపులకు మెస్‌లు కూడా లేవు. వర్షం వస్తే పెంటపాడు బాలికల హాస్టల్ ప్రాంగణం మొత్తం నీటితో మునిగిపోయి చిత్తడిగా మారుతుంది. దోమలు, ఇతర కీటకాలతో ప్రమాదకరంగా ఉంటుంది. దోమల బాధతో విద్యార్థులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ఈ హాస్టల్‌కి గేటు లేకపోవడంతో వార్డెన్ అరుణ జ్యోతి రూ. ఆరు వేలతో గేటును అమర్చారు. హాస్టల్ భవనాలు మొత్తం శిథిలావస్థకు చేరడం, ఎప్పుడు కూలిపోతాయా అన్నట్లు ఉండడంతో విద్యార్థుల సంఖ్య కూడా క్రమేపి తగ్గిపోతుంది. కొత్తగా తమ పిల్లలను హాస్టల్స్‌లో చేర్చాలని వచ్చే తల్లిదండ్రులు ఇక్కడ పరిస్థితి చూసి భయపడి తమ పిల్లలను వెనక్కి తీసుకు వెళ్ళిపోతున్నారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో హాస్టల్స్‌కు మంచి రోజులు వస్తాయని విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు.


పెచ్చులూడుతున్న హాస్టల్ భవనం శ్లాబ్

మా భూముల్ని మాకు ఇప్పించండి

శివగిరి నిర్వాసితుల డిమాండ్


తమ వద్ద ఉన్న భూముల ఆధారాలు చూపుతున్న శివగిరి నిర్వాసితులు

జీలుగుమిల్లి, ఆగస్టు 4 : పోలవరం నిర్వాసిత గ్రామం శివగిరి గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూముల్ని మండలంలో కొందరు గిరిజనులు అక్రమంగా సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆందోళన చెందుతున్నారు. పి.నారయణపురంలో శివగిరి నిర్వాసితులకు 218 ఎకరాల భూమిని ప్రభుత్వం భూమికి భూమి కింద కేటాయించింది. ఆయా భూములకు సంబంధించి పదేళ్ల క్రితం పాసు పుస్తకాలు ఇచ్చారు. అనంతరం ఆయా భూములు కొంత జల్లేరు ముంపు రిజర్వాయరు పరిధిలోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వం వారికి రాచన్నగూడెం, కామయ్యపాలెం గ్రామాల్లో కొంత భూమిని కొనుగోలు చేసింది. అయితే ఇంకా తమకు 70 ఎకరాల భూమి ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని ఆ గ్రామ నిర్వాసితులు చెబుతున్నారు. అయితే ముందుగా కేటాయించిన (జల్లేరు ముంపు రిజర్వాయరు) భూముల్ని గత పదేళ్లుగా కౌలుకు ఇచ్చి జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో కొందరు అక్రమంగా చొరబడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన భూములు తమకు కేటాయించి సర్వే చేయించి పొజిషన్ చూపాలని వారు కోరారు. సమస్యను తెలపిన వారిలో నిర్వాసిత గిరిజనులు అరగంటి కృష్ణకుమారి, బి.తమ్మన్నదొర, కె.రాములమ్మ, కె.విజయ ఉన్నారు.

పూర్తి డేటా లేదు

ఈ విషయమై సంబంధిత వీఆర్వో ముత్యంను వివరణ కోరగా శివగిరి వాసులకు ఎంత భూమి కేటాయించారో తమ వద్ద పూర్తి డేటా లేదన్నారు. జల్లేరు ముంపు భూముల్లో కొంత మిగులు భూమి ఉందన్నారు. సమస్య తహసీల్దారు దృష్టికి తీసుకెళతామన్నారు.

సొసైటీలో రుణం స్వాహా

» విచారణ చేసి, న్యాయం చేయండి
» గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసిన మృతుని కుమారుడు

పెదవేగి, ఆగస్టు 5 : చనిపోయిన వ్యక్తి పేరుతో సొసైటీలో రుణం మంజూరు చేసిన సంఘటన పెదవేగి సొసైటీలో జరిగింది. దీనికి సంబంధించిన మృతుని కుమారుడు తిప్పాభట్ల సత్యనారాయణ ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేయించి, న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులోని విషయాలు ఇలాఉన్నాయి. తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి(పెద్దరాముడు) అనేవ్యక్తి పెదవేగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణ లావాదేవీలు నిర్వహిస్తూ వచ్చారు. శ్రీరామచంద్రమూర్తి 2020 ఫిబ్రవరిలో మృతి చెందారు. అయినప్పటికీ ఆయన పేరుతో 2020, 2021, 2022 సంవత్సరాల్లో రుణం మంజూరు చేస్తూ, లావాదేవీలు నిర్వహించారు. ఈ విషయంలో సొసైటీ కార్యదర్శి తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి(చిన్నరాముడు)తోపాటు సిబ్బంది సహకారంతో ఇదంతా చేశారని, దీనిపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించినా, చిన్నరాముడు తన పలుకుబడితో విచారణ సక్రమంగా చేయకుండా అడ్డుకున్నారని, దీనిపై విచారణ చేయించి, న్యాయం చేయాలని మృతుని కుమారుడు సత్యనారాయణ అధికారులకు విన్నవించారు.

విద్యాశాఖలో ఉద్యోగుల మధ్య వివాదం

చేయి కోసుకున్న ఉద్యోగి

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో-2)కి, మండల విద్యా శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగికి మధ్య నెలకొన్న వివాదంలో చిరుద్యోగి చేయి కోసుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఈవోతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ చిరుద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు కొంతకాలంగా వివాదం జరుగుతుంది. గత శనివారం నిర్వహించిన సీఆర్పీల సమావేశం సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో ఎంఈవోకు, చిరుద్యోగికి మధ్య సంవాదం నెలకొనడం, అదే సందర్భంలో కార్యాలయంలోకి వెళ్ళిన ఉద్యోగి తన చేతిని కోసుకోవడంతో గాయాలపాలయ్యాడు. అప్రమత్తమైన ఎంఈవో రక్తస్రావంతోవున్న ఉద్యోగిని ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స చేయించారు. చేతికైన గాయానికి కుట్లు వేశారు. ఈ వివాదం కాస్తా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు తీసుకెళ్ళడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని మరోచోటకు బదిలీచేయడంగాని లేదా తనను బదిలీచేయడంగాని ఏదోఒకటి చేయాలని అభ్యర్థిస్తూ సోమవారం ఏలూరు మండల ఎంఈవోలిద్దరూ, కార్యాలయ సిబ్బందితోసహా తరలివచ్చి డీఈవో అబ్రహంను అభ్యర్థించారు. ఇటువంటి వివాదాస్పద ఉద్యోగులతో తాము పని చేయించుకోలేమని, భవిష్యత్తులో ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే బాధ్యులెవరతారని డీఈవోకు నివేదించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ వివాదం ఉపాధ్యాయవర్గాల్లో హాట్ టాపిక్‌గా నడుస్తోంది.

క్రైం కార్నర్

వ్యక్తి అనుమానాస్పద మృతి


రాజేష్(ఫైల్)

పెంటపాడు, ఆగస్టు 5 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ప్రత్తిపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి. గణపవరంనకు చెందిన గండికోట రాజేష్(31) చేపల ఫ్యాక్టరీలో ప్యాకింగ్ పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి 10 గంటలకు తన ఇంటి వద్ద పడుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున చూసేసరికి రాజేష్ కనపడలేదు. దీంతో కుటుంబ సభ్యులు పనికి వెళ్ళి ఉంటాడని భావించారు. అయితే ప్రత్తిపాడు పొలాల వద్ద అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెంది ఉండడంతో అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 11 గంటలు దాటిన తరువాత భార్య దానేశ్వరి తన భర్త రాజేష్‌కు ఫోన్ చేయడంతో పక్కనే ఉన్న స్థానికులు ఫోన్ తీసి ప్రత్తిపాడు గ్రామంలోని పొలాలలో రాజేష్ చనిపోయి ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ శీలం శంకర్ పరిశీలించారు. భార్య దానేశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి సోమవారం మృతి చెందాడు. విజయవాడకు చెందిన నిర్మల్‌నాయక్ (40) అతని భార్య పింకి నాయక్, కుమార్తె స్విప్తి, నిర్మల్‌నాయక్ సోదరుడు మౌలాలీ నాయక్‌లు కలిసి మోటారు సైకిల్‌పై ఈనెల 4వ తేదీన ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళారు. తిరిగి వస్తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ మదీనా హోటల్ ఎదురుగా రోడ్డుపైనే పార్కింగ్ చేసిన లారీని నిర్మల్‌నాయక్ ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో వీరంతా తీవ్ర గాయాలపాలవ్వగా విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నిర్మల్‌నాయక్ సోమవారం మృతి చెందారు. మిగిలిన వారు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి

ఆకివీడు, ఆగస్టు 5 : లారీని తప్పించబోయి ఢీకొట్టి పడిపోయిన యువకుడు సుగుణ విజయవాడలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భీమవరం గునుపూడికి చెందిన సుగుణ స్థానిక మీషో ఆఫీసులో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఇంటికి తిరిగి వెళ్ళుతుండగా స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో లారీని తప్పించబోయి ఢీకొట్టడంతో పడిపోయిన సుగుణపై నుంచి ఆటో వెళ్ళడంతో కుడికాలు నుజ్జునుజ్జు అయిన సంగతి తెలిసిందే. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ, గుంటూరు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్‌ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మొగల్తూరు, ఆగస్టు 5 :మండలంలోని పేరుపలెం బీచ్‌లో గల్లంతైన కొల్లి జాన్‌బాబు అనే యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం ఉదయం తణుకుకు చెందిన స్నేహితులతో పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. తీరంలో సరదాగా గడిపిన అనంతరం సముద్ర స్నానానికి దిగిన స్నేహితులు ఆరుగురిలో జాన్‌బాబు అలల ఉధృతికి గల్లంతయ్యాడు. గల్లంతైన ప్రదేశానికి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని మోళ్ళపర్రు ప్రాంతంలోని ఏటిపొర ప్రాంతంలో సోమవారం ఉదయం జాన్ బాబు మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. స్నేహితుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ బి.సత్యనారాయణ తెలిపారు.

ఆచంట ఎమ్మెల్యే పితాని సోదరుడి మృతి


సూర్యనారాయణ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న తెలంగాణ రిటైర్డ్ సీఎస్ సోమేశ్‌కుమార్, పితాని సూర్యనారాయణ(ఫైల్)

పోడూరు, ఆగస్టు, 5 : మండలంలోని కొమ్ముచిక్కాలకు చెందిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు, ప్రముఖ లేస్ వ్యాపారి, విద్యావేత్త పితాని సూర్యనారాయణ(76) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పితాని సూర్యనారాయణ ఆంధ్రా యూనివర్శిటీ పాలకవర్గ సభ్యుడిగా, లేస్ ఎగుమతిదారుడిగా, పెనుగొండ ఎస్‌వీకేపీ జూనియర్ కళాశాల చైర్మన్‌గా పని చేస్తున్నారు. హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే పితాని తన సోదరుడు సూర్యనారాయణ మృతి సమాచారం తెలియడంతో హుటాహుటీన స్వగృహానికి చేరుకుని సోదరుడు భౌతికకాయాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. బంధువులు, అభిమానులు ఎమ్మెల్యే పితానిని కలిసి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. సూర్యనారాయణకు అత్యంత సన్నిహితుడు తెలంగాణ రిటైర్డ్ సీఎస్ సోమేశ్‌కుమార్ కొమ్ము చిక్కాలకు వచ్చి సూర్యనారాయణ పార్థివ దేహాన్నికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు, అల్లు వెంకట సత్యనారాయణ,, బండారు మాధవనాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ దేవళ్ల ప్రసాదు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుబ్బల తమ్మయ్య మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, లేస్ ఎగుమతిదారుడు కలవకొలను తులసీరావు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సూర్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

'బందా' కాంస్య విగ్రహావిష్కరణ


కనకలింగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుటుంబ సభ్యులు

కైకలూరు, ఆగస్టు 5: సినీ, రంగ స్థల నటుడు బందా కనక లింగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని అటపాకలో సోమవారం ఆవిష్కరించారు. అటపాక కనకలింగేశ్వర స్వామి వంశపారంపర్య ధర్మకర్తలైన బందా కనకలింగేశ్వర రావు కాంస్య విగ్రహాన్ని ఆయన మనవడు కృష్ణసాయి సిద్ధార్థ ఆవిష్కరించారు. కనకలింగేశ్వర రావు అటపాక గ్రామంలో జన్మించి సారంగధర, బాలనాగమ్మ, పాదుకా పట్టాభిషేకం సినిమాలతో పాటు ఆంధ్ర నాటక రంగ స్థలంపై విభిన్న పాత్రల్లో నటిం చారు. ఆయన గుర్తుగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీ యమని గ్రామస్థులు పేర్కొన్నారు. బందా వంశీకులు బందా గోపాలకృష్ణ గాంధీ, బందా సత్యనారాయణ, ఆలయ ఈవో వీఎస్‌కె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



ఏలూరు క్రైం, ఆగస్టు 5 : ఓ యువకుడు మానసిక సంఘర్షణకు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. నేరుగా ఏలూరు వచ్చే శాడు. విజయవాడలో ఉన్న తన అక్కకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. ఆ క్షణమే విజయవాడలో ఉన్న అతని అక్క లక్ష్మీ 112 కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసింది. తనతమ్ముడు నక్కా రాజేష్(31) ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఉన్నాడని ఆత్మహత్య చేసుకుంటాన్నాడని చెప్పడంతో విజయవాడ కంట్రోల్ రూమ్ పోలీసులు, ఏలూరు టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్‌కు సమాచారమిచ్చారు. దీంతో వెంటనే సీఐ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్ళు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విజయవాడలో ఉన్న లక్ష్మీ నుంచి వాట్సప్ ద్వారా ఆమె తమ్ముడు రాజేష్ వివరాలు, ఫోటోలు పొందారు. ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఉన్నట్లు ప్రాథమికంగా సమాచారం తెలుసుకుని పోలీసులు వెంటనే అక్కడకు వెళ్ళి ఆ యువకుడిని గమనించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. సీఐ ప్రభాకర్ రాజేష్‌కు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్టు



కావవరపుకోట, ఆగస్టు 5 : ఒక ముఠాగా ఏర్పడి వాహనాల్లో టైర్లను అపహరిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తడికలపూడి ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. సోమ వారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల బస్సులో సామగ్రిని, టైర్లను అపహరిస్తున్నట్టు అనుమానితులైన పుచ్చులపాటి చందు, కొల్లా ఈశ్వర్, పాలగాని సాయిదుర్గారావు, బొడ్డు వెంకట్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పర్చామని చెప్పారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు దాదాపు రూ.లక్షా 20 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

ఇత్తడి వస్తువుల చోరీకి యత్నం

భీమవరం క్రైం, ఆగస్టు 5 : భీమవరం రెండో పట్టణంలోని శ్రీరాంపురంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఇత్తడి వస్తువుల చోరీకి ప్రయత్నిస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. టూటౌన్ ఎస్‌ఐ సీహెచ్‌వీ రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం శ్రీరాంపురంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని పునఃనిర్మిస్తున్నారు. దానిలో భాగంగా ఇత్తడి వస్తువులను వెనుక ఉన్న కల్యాణ మండపంలో ఉంచారు. అయితే సోమవారం ఉదయం ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన పేదాల శ్రీను అనే వ్యక్తి డిమార్ట్ సమీపంలో నివాసముంటున్నాడు. నెంబర్ లేని ద్విచక్ర వాహనం పై వచ్చి ఇత్తడి వస్తువులను దొంగతనానికి ప్రయత్నిస్తుండగా ఆలయ ఈవో దండు వెంకట కృష్ణంరాజు మరో వ్యక్తి అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే గతంలో కూడా సుమారు రూ.50 వేలు విలువ చేసే ఇత్తడి వస్తువులు మాయం అయినట్లుగా పోలీసులకు తెలపడంతో ఆ రూ.50 వేలను శ్రీనివాస్ నుంచి పోలీసులు రికవరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భర్త ఆత్మహత్యపై భార్య ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 5 : టి.నరసాపురం మండలం బొర్రంపాలెంకి చెందిన కలపర్తి వెంకటేశ్వర రావు ఆత్మహత్య ఘటనపై మృతుడి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జ్యోతి బసు తెలిపారు. తాపీ మేస్త్రీగా పని చేసే మృతుడి వెంకటేశ్వరరావు కుమార్తె ఏడాది క్రితం జ్వరంతో మరణించింది. దీంతో కొన్ని రోజులుగా మానసికంగా కుంగిపోతున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం వెంకటేశ్వరరావు భార్య అన్నపూర్ణకు ఒంట్లో బాగోక పోవడంతో జంగారెడ్డిగూడెంలోని ఆమె చెల్లెలు నేతల సంధ్యారాణి ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి వైద్యం నిమిత్తం తన తమ్ముడి ఇంటికి ఏలూరు వెళ్ళింది. ఇదిలా ఉండగా సోమవారం అన్నపూర్ణ భర్త వెంకటేశ్వరరావు జంగారెడ్డిగూడెం మరదలి ఇంటికి వచ్చాడు. అక్కడ తన భార్య లేక పోవడంతో మనస్థాపం చెంది తనతో తెచ్చుకున్న గుర్తు తెలియని పురుగు మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుని రోడ్డుపై పడి ఉండడాన్ని చూసిన స్థానికులు 108 ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లబ్‌పై పోలీసుల దాడి

భీమవరం క్రైం, ఆగస్టు 5 : భీమవరం రెండో పట్టణంలోని ఒక ప్రముఖ క్లబ్‌పై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. లక్ష ఐదు వేల 900లు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 5 : గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వర రావు సోమవారం తెలిపారు. ఈ నెల 2న టి.నరసాపురం గ్రామం వెలుపల ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంక్ సమీపంలో గ్రామానికి చెందిన షఫ్రక్ ఇమామ్ సాహెబ్ తన స్నేహితులతో కలిసి నడుచుకుంటూ టి.నరసాపురం వైపుగా వెళుతుండగా చింతలపూడి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వెనుక నుంచి ఢీకొనడంతో ఇమామ్ సాహెబ్ తీవ్రంగా గాయపడాడు. అతడిని స్థానికులు ఏలూరు ఆంధ్రా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 5 :బాలిక అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల రెండో తేదీ సాయంత్రం బాలికను ఇంటి వద్ద పెట్టి తల్లి డ్వాక్రా మీటింగ్‌కు వెళ్ళింది. మీటింగ్ అయిన తర్వాత ఇంటికి వచ్చి చూస్తే బాలిక కనిపించకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికింది. అయినా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. తన ఫిర్యాదులో స్థానిక డాంగే నగర్‌కు చెందిన వెంకీ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేసినట్లు రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



ఆదివాసీ దినోత్సవం కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 5: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొవ్వాసి దుర్గారావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడారు. జీవో నెంబరు 3 పటిష్టంగా అమలుపరచి ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కులు, చట్టాలు, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. అటవీ హక్కుల చట్టం వచ్చి 18 ఏళ్లయినా గిరిజనులకు హక్కుపత్రాలు ఇవ్వలేదన్నారు. ఈ నెల 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కరపత్రాలను విడుదల చేశారు. తామా ముత్యాలమ్మ, నూక భద్రం, శ్రీను, శిరమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో అర్జీదారులకు భోజన సౌకర్యం



భోజనం వడ్డిస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, ఆగస్టు 5: ఉన్నతాధికారులకు అర్జీలు ఇవ్వడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సత్యసాయి సేవా సంస్థ భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఎస్పీ జి.స్వరూపరాణి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి ప్రతి సోమవారం వచ్చే అర్జీదారులకు భోజన వసతిని ఏర్పాటు చేయాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావుకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం భోజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, వీవీ.సుబ్బారావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను భయపెట్టే ధోరణిలో బీజేపీ



మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 5 : భారతీయ జనతా పార్టీ దేశంలో మతోన్మాద పార్టీగా తయారైందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ కలలను అడ్డుకున్న ప్రతిపక్షాలను భయపెట్టి లొంగదీసుకోవాలని మోదీ ప్రయత్నం చేస్తున్నారని, వారి ఆటలు సాగవన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశానికి సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పోరాటాలను నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ వివరించారు. ఐక్య పోరాటాలతో హక్కులను సాధించుకోవచ్చని చెప్పారు. సీపీఐ అనుబంధ సంస్థలన్నీ ప్రజలను చైతన్యవంతం చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చలసాని రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి సీపీఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం



మాట్లాడుతున్న విస్సంపల్లి సిద్ధు మాదిగ

టి.నరసాపురం, ఆగస్టు 5: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్ధు మాదిగ అన్నారు. బండివారిగూడెంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పోరాటంతో న్యాయం గెలిచిందన్నారు. బండివారిగూడెం కమిటీ పెద్దలు డొక్కా దుర్గయ్య, కొలుకులూరి సూరీడు, రాయల పాపారావు, పింగుల నాగేశ్వరరావు, మనెల్లి పుల్లారావు, వేల్పుల జనార్ధన్‌రావు, బాబురావు, గ్రామ కమిటీ, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

కేరళ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న కార్యకర్తలు

టి.నరసాపురం, ఆగస్టు 5: కేరళలోని వయనాడులో తీవ్ర కొండ చర్యలు విరిగిపడిన దుర్ఘటనలో బాధితులకు సహాయార్థం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, మండల నాయకులు మురళీ మాట్లాడుతూ విపత్తులో ఉన్న వారిని ఆదుకోవడం మానవతా ధర్మమని అన్నారు. ఈ దుర్ఘటనను జాతీయ విపత్తుగా గుర్తించకపోవడం, పార్లమెంట్ జరుగుతున్న సందర్భంలో కనీసం చర్చించకపోవడం తగదన్నారు. కేరళ ప్రజలకు చేతనైన సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. పలువురి నుంచి రూ.5130 సేకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు బి.కుమారి, ముత్తమ్మ, మడకం కుమారి, సీత, మంగ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీజేపీ మండల కమిటీ సమావేశాలు



ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు సత్కారం

ఏలూరు రూరల్, ఆగస్టు 5: బీజేపీ మండల కమిటీ సమావేశాలు ఈ నెల 7,8 తేదీల్లో ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి జి.మధుకర్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్ అధ్యక్షతన ఏలూరులో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 11, 12, 13 తేదీల్లో యువమోర్చా ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా యాత్రలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరవేయాలన్నారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.విశ్వనాథరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అంబికా కృష్ణ తదితరులు ప్రసంగించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బి.నిర్మలకిషోర్, శరణాల మాలతిరాణి, కె.కృష్ణప్రసాద్, సుధాకర్‌కృష్ణ,కె.కృష్ణ, సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, దానబాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఫీజు కోసం విద్యార్థులను కిందికి దించేశారు!

అధికారుల విచారణలో కాదన్న విద్యార్థుల తల్లిదండ్రులు

అర్బన్, ఆగస్టు 5: కళాశాల బస్సుఫీజు చెల్లించడంలేదని ఇంటర్మీడియట్ విద్యార్థులను కళాశాల యాజమాన్యం విద్యార్థులను బస్సు నుంచి బలవంతంగా కిందికి దించేశారు. దీనిపై కలెక్టర్‌కు సమాచారం అందడంతో ఆమె ఆదేశాల మేరకు ఆర్ఐవో చంద్రశేఖరబాబు సోమవారం విచారణ నిర్వహించారు. ఎన్ఆర్ పేటలో ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులను కైకలూరు మార్గంలో సోమవారం ఉదయం కొందరిని దించేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పిలిపించి ఆర్ఐవో విచారించారు. తమ పిల్లలను బలవంతంగా కళాశాల యాజమాన్యం దించలేదని తల్లిదండ్రులు చెప్పారని, ఇదే విషయాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్ఐవో వెల్లడించారు.

మంత్రి పార్థసారథికి తెలంగాణ మంత్రి తుమ్మల ఫోన్

చింతలపూడి, ఆగస్టు 5: శివపురం, చిన్నంపేట మధ్య కాజ్‌వే స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథిని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శివపురంలో గుత్తా సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి సోమవారం వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పలువురు కొన్ని సమస్యలు తెలిపారు. తమ్మిలేరుకు వరద వచ్చినప్పుడల్లా చిన్నంపేట, శివపురం ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. కాజ్‌వే రెయిలింగ్ పడిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సత్తుపల్లి నుంచి తుమ్మూరు, శివపురం, చిన్నంపేట మీదుగా విజయవాడకు బస్సు సర్వీసు వరదలతో రద్దు చేశారు. ఈ సమస్యలపై మంత్రి పార్థసారధికి తుమ్మల ఫోన్‌లో వివరించారు.

సమస్యలపై సమరం

కలెక్టరేట్ వద్ద ఆందోళన.. అధికారులకు వినతి



ఏలూరు జిల్లాలో ఉచిత ఇసుక కోసం కార్మికుల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు



అక్రమ తొలగింపులపై స్కీమ్ వర్కర్ల ధర్నా

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 5: ఏలూరు జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని కొవ్వూరు, వాడపల్లి, పెండ్యాల, సిద్ధాంతం తదితర రీచ్‌ల నుంచి ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కేవీ. రమణ, ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడారు. భవన నిర్మాణానికి గోదావరి ఇసుక, కొవ్వూరు నుంచి తీసుకువచ్చేవారమన్నారు. ఏలూరుకు కుక్కునూరు ప్రాంతం నుంచి ఇసుక తెచ్చుకోవాలని అధికారులు చెబుతున్నారన్నారు. కుక్కునూరు నుంచి తేవాలంటే మధ్యలో తెలంగాణ బోర్డర్ ఉన్నందున అధికారులు ఆపుతున్నారన్నారు. నిర్మాణ కార్మికులతో పాటు లోడింగ్, అన్‌లోడింగ్ కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాకు కొవ్వూరు నుంచి గోదావరి ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. యర్రా శ్రీను, కాకర్ల శ్రీను, మామిడి రామ్‌గోపాల్, గంగరాజు, కె.రాజశేఖర్, మహిళా నాయకులు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులు.. రాజకీయ వేధింపులు ఆపండి

అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులకు నిరసనగా కలెక్టరేట్ వద్ద మహిళా కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం మారడంతో తమ వారిని నియమించుకోడానికి రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, వీవోఏలు, పంచాయతీ కార్మికులు, చిరుద్యోగులను అక్రమంగా తొలగించడం దారుణమంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రాజు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రెండు నెలలు తిరగకముందే వందలాది మంది మహిళలు అక్రమ తొలగింపులకు, వేధింపులకు నిరసనగా ఇంతమంది మహిళలు రావడాన్ని బట్టి ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని విడనాడాలన్నారు. తొలగించిన స్కీమ్ వర్కర్లను, చిరుద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.నాగమణి, భారతి, సుభాషిణి, దుర్గారావు, సోమయ్య, విజయలక్ష్మి, స్కీమ్‌వర్కర్లు, చిరుద్యోగులు పాల్గొన్నారు.

కృష్ణా డెల్టా శివారు భూములకు నీరందించాలి

కృష్ణాడెల్టా శివారులో పెదపాడు మండల ఆయకట్టుకు సాగు నీరు అందించాలని కోరుతూ రైతులు సోమవారం వీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడారు. కృష్ణా డెల్టా పరిధిలో వేలాది ఎకరాలకు సాగు నీరందక, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరిగేషన్ అధికారులు అనాలోచిత చర్యలతో రైతులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేఈ కెనాల్లో కర్రనాచు, గుర్రపుడెక్క, తూడు పెరిగిపోయాయని, వేసవిలో కేఈ కెనాల్‌ను బాగు చేయకపోవడం వల్ల నీరుపారుదల లేక శివారు ప్రాంత భూములకు సాగునీరు అందడం లేదని, అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో కొమ్మన సాంబశివరావు, ధనకోటేశ్వరరావు, కె.రామబ్రహ్మం, కె.ఎస్.ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా గోదావరి నీటి హక్కును పరిరక్షించండి

కృష్ణా-గోదావరి నదీ జలాల పంపిణీతో రాష్ట్రానికి సంక్రమించిన నీటి హక్కులను పరిరక్షించాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వినతిప్రతం అందజేశారు. విభజన చట్టానికి వ్యతిరేకంగా తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు, రంగారెడ్డి, దిండి, కలవకుర్తి ప్రాజెక్టులతో రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ట్రిబ్యునల్ ముందు నివేదించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, ఉప్పులూరి హేమశంకర్, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీరు ఇవ్వకపోతే సాగు చేయలేం

పెదపాడు: నీరు ఇవ్వకపోతే పంటలు సాగు చేయలేమని వట్లూరులో రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా కాలువలో కర్రనాచు, తూడు పెరిగిపోతే కృష్ణా డెల్టా నీటిపారుదల సలహా మండలి ఏం చేస్తుందని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీరు అందించాలని లేకపోతే క్రాప్ హాలీడే మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు తుమ్మల ధన కోటేశ్వరరావు, కొమ్మన రామబ్రహ్మం, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామవరం గ్రామసభలో మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్



ప్రభుత్వాసుపత్రి వైద్య శిబిరంలో ఎమ్మెల్యే చంటికి వైద్య పరీక్షలు

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేస్తుంది : చింతమనేని

దెందులూరు, ఆగస్టు 5: టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శ్రీరామవరం, కొత్తగూడెం పరిధిలో సీతంపేటలో సోమవారం మీకోసం మీ చింతమనేని పేరిట గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎరువులను అధిక ధరకు అమ్ముతున్నారని పలువురు రైతులు చింతమనేని దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు ప్రజలకు సేవలందించి మంచి పేరు పొందాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో జనసేన, బీజేపీ నేతలతో కలసి ముందుకు వెళ్లాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నానిబాబు, పసుమర్తి మధుబాబు, పర్వతనేని రామకష్ణ, పరసా వెంకట్రావు, యలమర్తి శ్రీనివాసరావు, నాగనబోయిన సత్యనారాయణ, పుల్లా శ్రీనివాసరావు, ఎంపీ డీవో శ్రీలత, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే బాలరాజు

వేలేరుపాడు: వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు భరోసా ఇచ్చారు. వేలేరుపాడు జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరద పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితులకు సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా బాధితులను ఆదుకున్నాయని, వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కీర్తన ఫీన్ సెర్వ్ ఛైర్మన్ పద్మాజారెడ్డి వరద బాధితులకు బియ్యం, దుస్తులు, కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. గడ్డమనుగు రవికుమార్, సంజయ్, సుధాకర్, మోహన్, గద్దం వెంకటేశ్వరరావు, వీరాస్వామి, గుడిపెట్టి సురేష్, యాళ్ళ శంకర్, ములిశెట్టి యుగంధర్, తోట రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఉత్తమ సేవలకు కృషి : ఎమ్మెల్యే చంటి

ఏలూరు క్రైం: రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ వైద్య సేవలందించే స్థాయికి ప్రభుత్వ ఆసుపత్రి సేవలు విస్తృతం చేయడం తమ ఆకాంక్ష అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రైవేటు భాగస్వామ్యంతో విజయవాడ పీవీఆర్ కార్డియాక్, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఉచిత గుండె వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ఆయన బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు కూడా కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్యశిబిరాలకు శ్రీకారం చుట్టామన్నారు. పీవీఆర్ ఆసుపత్రుల ఎండీ పాతూరి వెంకట రామచౌదరి, డిసీహెచ్ఎస్ పాల్ సతీష్‌కుమార్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ సీహెచ్ సుధాకర్, ఆర్ఎంవో దుర్గాకుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డి.మల్లికార్జునరావు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఎన్నిక

ఏలూరు టూటౌన్, ఆగస్టు 5: నగరంలోని అన్ని చర్చ్‌ల పాస్టర్స్ సిటీ పాస్టర్స్ అసెంబ్లీగా ఏర్పాటయ్యారు. ఫ్రెండ్స్ ఆఫ్ గాడ్ చర్చ్‌లో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చీఫ్ పాట్రన్స్‌గా బిషప్ కారుపాటి శాంతిసాగర్ బిషప్ జి.సుభద్రరావు, బీ.జీవన్‌కుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా కె.సుదర్శన్‌బాబు, సెక్రటరీగా ఈ.రత్నప్రసాద్, ట్రెజరర్‌గా జోసఫ్ చిక్కాల, వైస్‌ప్రెసిడెంట్‌లుగా కె.జీవానందం, జి.జాన్‌పీటర్, ఈ.గ్రేస్‌జాన్, జాయింట్ సెక్రటరీగా టి.ఆనంద్‌కుమార్, సభ్యులుగా శేఖర్‌బాబు, జోసఫ్, రెవరెండ్ ఆదాము సురేష్, ఎస్.దాసు, ఎం.ప్రశాంత్‌బాబు, జేమ్స్ విజయ్ కుమార్, జి.ఏసుపాదం ఎన్నికయ్యారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

దెందులూరు, ఆగస్టు 5: ప్రతి రైతు సాగు చేస్తున్న పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని దెందులూరు, కైకలూరు, ఏలూరు నియోజకవర్గాల ఉద్యానవన శాఖ అధికారి బి.కరణ్ అన్నారు. దెందులూరు రైతు భరోసా కేంద్రంలో ఈ పంట నమోదుపై సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా పలు సబ్సిడీ పథకాలను అందిస్తుందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు

గొల్లగూడెం మద్యం దుకాణం మూసివేత

ఉంగుటూరు, ఆగస్టు 5: మండలంలో గొల్లగూడెం-నల్లమాడు గ్రామాల మధ్య మద్యం దుకాణాన్ని సోమవారం మూసివేస్తూ ఎక్సైజ్ ఎస్సీ కుమార స్వామి ఉత్తర్వులు ఇచ్చారు. గొల్లగూడెం, నల్లమాడు, కంసాలిగుంట, యర్రమిల్లిపాడు గ్రామాల విద్యార్థులు హైస్కూలుకు వెళ్లే మార్గంలో మందుబాబుల ఆగడాలపై సీపీఎం నాయకుడు నక్కా మదన్ మోహన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక విద్యార్థినిని వేధించిన సంఘటనపై పోక్సో కేసు నమోదైంది. దీనితో మద్యం దుకాణం మూసివేతకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేసిన మదన్‌మోహన్‌కు సమాచారం ఇచ్చారు.

వరద ప్రాంతాల్లో విద్యుత్ సేవలు అభినందనీయం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 5: వరదలకు కుకునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యుత్‌లైన్లు పునరుద్ధరించడంలో ఈఈ రాధాకృష్ణ కీలక పాత్ర పోషించారని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వి.ఇ.సుబ్రహ్మణ్యం, సీహెచ్.రాజు అన్నారు. సోమవారం సన్మానించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 5: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంహెచ్‌వో రెడ్డి మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా 6వ డివిజన్ మాదేపల్లి ఇందిరమ్మ కాలనీ, చెంచు కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. స్ప్రేయింగ్, ఫాగింగ్ చేశారు. నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. కార్యక్రమలో మాలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేసిన పంచాయతీ సిబ్బంది

పోలవరం, ఆగస్టు 5: గ్రామంలో మంచినీటి ట్యాంకులను పంచాయతీ సర్పంచ్ పొదం పుష్ప, ఉప సర్పంచ్ కోరశిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యదర్శి వై కొండలరావు బ్లీచింగ్ చేయించి శుభ్రం చేయించారు. డ్రైన్లలో పూడిక తీత పనులు నిర్వహించారు. దేవరగొంది, బీసీ కాలనీ, బాపూజీ కాలనీ , కొత్తపేట కాలనీలలో వాటర్ ట్యాంకులను శుభ్రపరిచారు. నివాసాల వద్ద నిలిచిపోయిన నీటిని మోటార్లతో బయటకు పంపుతున్నారు.

గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలి

లింగపాలెం, ఆగస్టు 5: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రతిరోజూ పర్యవేక్షించాలని కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ అబీద అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరం, మలేరియా గుర్తిస్తే వెంటనే వైద్య సేవలందించాలన్నారు. ప్రతిఒక్కరూ గ్రామాల్లో ప్రతిరోజూ పర్యటించాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుదల చర్యలు తీసుకోవాలని, మురుగు గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు.

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

పోలవరం, ఆగస్టు 5: పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రుల పిల్లల ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లు తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలకు లైంగిక నేరాలు, పోక్సో కేసులు, మహిళా చట్టాలు, మహిళా హక్కులు, బ్యాడ్, గుడ్ టచ్, చట్టాల అమలు, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఎస్ఐ సూచించారు. ఆడపిల్లలు, మగపిల్లల అలవాట్లు గమనించి అదుపులో పెట్టుకుని మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు, గురువులు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. హెచ్ఎం లక్ష్మీకాంతం, ఉపాధ్యాయులు భవాని, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అంబికాదేవి సన్నిధిలో శ్రీచక్రానికి పాలాభిషేకం

అమ్మవారి ఆలయాల్లో వైభవంగా శ్రావణ పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 5: నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద శ్రావణ మాస పూజలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి సన్నిధిలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అంబికాదేవి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో శ్రీచక్ర లక్ష్మీ కుంకుమ పూజ చేశారు. దక్షిణపువీధి మార్కండేయ స్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరి జ్ఞాన సరస్వతీదేవి, పవరుపేట కాశీ అన్నపూర్ణాదేవి, బావిశెట్టివారిపేట, పత్తేబాద కనకదుర్గమ్మ ఆలయాల వద్ద పూజలు చేశారు.

కనకదుర్గమ్మ దయతో నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. వైఎస్ఆర్.కాలనీలో కనకదుర్గమ్మ సారె మహోత్సవంలో ఎమ్మెల్యే చంటి పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, చోడే బాలు, అధ్యక్షుడు సురేష్, బసవయ్య, గోపి, సరళా, నాగమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

14 వరకు 'ఇగ్నో' ప్రవేశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 5: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో) దూరవిద్య డిగ్రీ, పీజీ, ఎంబీఏ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని 'ఇగ్నో' స్టడీసెంటర్ ప్రిన్సిపాల్ రామరాజు, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు వివరాలు తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో అడ్మిషన్ల లింక్‌ద్వారా ఈ నెల 14లోగా ప్రవేశాలకు గడువు ఉందన్నారు. వివరాలకు స్టడీసెంటర్ ఫోన్‌నెంబరు 94903 50469లో సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ల నియామకం

పెదవేగి, ఆగస్టు 5: తహసీల్దారుగా జి.సుందర్‌సింగ్ నియమితులయ్యారు. సుందర్‌సింగ్ ఎన్నికల సమయంలో బదిలీ అయ్యారు. అనంతరం తిరిగి ఆయనను ఇక్కడ నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. సుందర్ సింగ్ బుధవారం విధుల్లో చేరతారని అధికారులు తెలిపారు.

● ఉంగుటూరు: తహసీల్దార్‌గా పి.సతీష్ నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ద్వారకా తిరుమల మండలం నుంచి సతీష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు క్రైం, ఆగస్టు 5: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్గి ఉండాలని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడుపకూడదన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, కెబి సీతారామ్, వరప్రసాదరావు, ట్రాఫిక్ ఏఎస్ఐ ఎవైఆర్ రాజు, సీహెచ్‌వి సురేంద్ర, డాక్టర్ జి స్పందన, వి.నాగరాజు, అనూష, ఎ.ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** విభిన్నప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థులకు డీఆర్వో డి.పుష్పమణి డైజీ ప్లేయర్లను అందించారు. చింతపల్లికి చెందిన జరపాల నాగలక్ష్మి, సీతానగరానికి చెందిన జరపాల కుమారనాయక్‌కు వాటిని అందజేశారు. ఆర్డీవో ఖాజావలీ, ఎం.ముక్కంటి పాల్గొన్నారు.
- **పెదవేగి :** నడవలేని దుస్థితిలో ఉన్న తల్లీ, కొడుకులకు 'చేయూత' సంస్థ ఆర్థికసాయం అందించింది. జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్‌కు చెందిన మిరియాల సీతారావమ్మ, కుమారుడు లాజర్‌కు పెదవేగి చేయూత సంస్థ సభ్యులు వీల్‌ఛైర్, రూ.10వేలు అందించారు.
- **ఉంగుటూరు :** బూరుగుపల్లి వీరాంజనేయులు సేవలు చిరస్మరణీయమని మానవత జిల్లా ప్రతినిధి సాగిరాజు జానకిరామరాజు అన్నారు. సోమవారం బూరుగుపల్లి సంతాప సభ నిర్వహించారు. పుప్పాల గోపి, గుణ్ణం బుల్లెబ్బాయి, పుసులూరి ప్రకాష్, అడపా శ్రీను, బొమ్మిడి అప్పారావు, పొన్నం బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం ఎలిమెంటరీ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని మాజీ ఎంపీపీ గోలి శ్రీనివాసరావు పరిశీలించారు. వార్డు సభ్యుడు నేకూరి ఆశీర్వాదం పాల్గొన్నారు.
- **జీలుగుమిల్లి :** జనసేన జీలుగుమిల్లి గ్రామ అధ్యక్షుడిగా కోలా మధును ఎంపిక చేసినట్లు పసుపులేటి రాము తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మధు అన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, గడ్డమణుగు రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానవ సేవే మాధవ సేవ అనే అంశంపై మానవత ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అధ్యక్షుడు ఏవీ.రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఎస్సీ రిజర్వేషన● వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును కొందరు వ్యతిరేకించడం సబబు కాదని ఎమ్మార్పీఎస్ నాయకుడు విస్సంపల్లి సిద్ధు మాదిగ అన్నారు. తాడువాయిలో అరుంధతి యూత్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బడ్డపాటి శ్రీను, చంద్ర పండు, గాలింపు ప్రసాద్, సతీష్, రాజేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అమ్మపాలెం అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఏలూరు సీడీపీవో పద్మావతి

తల్లి పాలతో పిల్లలకు ఆరోగ్యం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 5: తల్లి పాలు పిల్లలకు ఆరోగ్యమని, బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు పట్టించాలని సీడీపీవో సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలో సీడీపీవో పి.బ్యూలా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది 2 కె రన్ నిర్వహించారు. ఉప్పరమెట్ట, సాయి బాలాజీ టౌన్‌షిప్ తదితర అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో వి.రాంబాబు, సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. లక్కవరం సెక్టారు అమ్మపాలెంలో సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం, బాలింతలకు పసుపు కుంకుమ అందజేశారు. హెచ్ఎం టి.ఝాన్సీ, అంగన్వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● చింతలపూడి: మండలంలోని రాఘవాపురం సెక్టార్ శివపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టత, పోషకాలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూపర్‌వైజర్ శ్యామల అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● భీమడోలు: పూళ్ళ సెక్టారు పరిధిలోని పలు గ్రామాల్లో తల్లి పాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పూళ్ళ, కోడూరుపాడు, దుద్దేపూడి, అన్నేవారిగూడెం, కురేళ్ళగూడెం, అంబర్‌పేట గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి తల్లి పాల విశిష్టతను వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు పట్టించాలని ఐసీడీఎస్ ఏలూరు సీడీపీవో ఎ.పద్మావతి అన్నారు. ఏలూరు పాములదిబ్బ సచివాలయం వద్ద అవగాహన సదస్సును నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ తల్లి పాలలో అనేక రకాల పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, ఏఎన్ఎం నిర్మలారాణి, ఎంఎస్‌కె భవానీ, సూపర్‌వైజర్ జోషి, సచివాలయ కార్యదర్శి నవ్య, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న బాలిక అపహరణ

- పామాయిల్ తోటలో గుర్తింపు
- ఒంటిపై గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- లైంగిక దాడి జరిగిందీ.. లేనిదీ ఇంకా ధ్రువీకరించని వైద్యులు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో
- పోలీసుల దర్యాప్తు
- సీసీ ఫుటేజ్‌లో అనుమానితుడి గుర్తింపు
- దోషులను పట్టుకోవాలని మంత్రి పార్థసారథి ఆదేశం

నూజివీడు, ఆగస్టు 5: తల్లిదండ్రుల పక్కన ఆదమరిచి నిద్రిస్తున్న నాలుగేళ్ల బాలిక ఆదివారం రాత్రి 12, ఒంటి గంట సమయంలో అపహరణకు గురైంది. రాత్రి 2 గంటల సమయంలో పామాయిల్ తోటకు నీరు పెట్టడానికి పొలానికి వచ్చిన రైతుకు ఈ చిన్నారి ఏడుస్తూ ఎదురురావడం కనిపించింది. ఆ బాలికను సదరు రైతు అదే గ్రామంలో ఉన్న బాలిక తల్లిదండ్రుల వద్దకు చేర్చాడు. బాలిక ఒంటి పై గాయాలు ఉండటం, బాలిక కాళ్ళకు ఉండాల్సిన వెండిపట్టీలు లేకపోవడం, బాలిక తల్లిదండ్రులు గమనించారు. ఈ సంఘటన నూజివీడు మండలంలోని ఒక గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామంలో ఒక సాధారణ కుటుంబం నివసిస్తోంది. ఆదివారం రాత్రి ఎప్పటిలాగానే తల్లిదండ్రుల పక్కన ఈ చిన్నారి నిద్రించింది. గుర్తుతెలియని వ్యక్తి ఈ గృహంలోకి అర్ధరాత్రి ప్రవేశించాడు. తండ్రి పక్కన ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు ఆదమరిచి నిద్రిస్తున్న బాలికను నిద్రలోనే అపహరించాడు. ఈ బాలిక నివాస గృహం సమీపంలోనే పామాయిల్ తోటలు ఉన్నాయి. రాత్రి 2 గంటల సమయంలో తోటకు నీరుపెట్టడానికి బోర్‌ను ఆన్ చేయటానికి ఆ రైతు తన పొలంలోకి రాగా బాలిక ఏడుస్తూ తోటలో నుంచి రావడం గమనించాడు. ఆ బాలిక తన తోట సమీపంలోనే నివసిస్తున్న వారి కుమార్తెగా గుర్తించి బాలికను తీసుకుని ఆమె ఇంటికి వచ్చాడు. బాలిక ఒంటిపై గోళ్ళ గాయాలు ఉన్న విషయం గమనించిన తల్లిదండ్రులు, సెల్‌ఫోన్ లేకపోవడం, బాలిక కాలికి ఉండాల్సిన వెండిపట్టీలు లేకపోవడం గమనించారు. బాలికను హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్సచేసి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో బాలిక చికిత్స పొందుతోంది. పాప పరిస్థితి నిలకడగానే ఉందని తెలుస్తోంది.

ఇంకా ధ్రువీకరించలేదు...

బాలిక పై అత్యాచారం జరిగిందనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం నూజివీడులో విలేకరులతో మాట్లాడుతూ బాలికపై అత్యాచారం జరిగిందా? లేక యత్నం జరిగిందా? అనే విషయాన్ని ఇంకా ప్రభుత్వ వైద్యులు ధ్రువీకరించలేదని తెలిపారు. బాలికకు మెరుగైన చికిత్స అందుతోందన్నారు.

పోలీస్ టీంలను ఏర్పాటు చేశాం...

బాలిక విషయంలో ఏం జరిగింది అనేది కొన్ని గంటల్లోనే తెలుస్తుందన్నారు. బాలిక ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు ఒక వ్యక్తిని అనుమానితుడిగా గుర్తించారు. అయితే సదరు వ్యక్తి ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఉన్నట్లుగా గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకోవడానికి వెళ్ళారన్నారు. బాలిక శరీరంపై గోళ్ళగాయాలు ఉన్న మాట వాస్తవం. అయితే ఏం జరిగింది అనేది ఇంకా తెలియవలసి ఉంది. నిందితులను కఠినంగా శిక్షించటం జరుగుతుందని ఆర్డీవో స్పష్టం చేశారు.

దోషులను వెంటనే పట్టుకోండి: మంత్రి పార్థసారథి

బాలిక విషయం ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. పోలీస్ జాగిలాలను సైతం రంగంలోకి దింపి దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. బాలిక కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను మంత్రి సారథి ఆదేశించారు.



కాల్వ ఒడ్డున కొబ్బరి మొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, ఆగస్టు 5 : గుర్వాయిపాలెం వంతెన సమీపంలో పెదలంక కాల్వ అంచున నాటిన కొబ్బరి మొక్కలను ఉపాధి ఏపీవో ఆనంద్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు సోమవారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 1వ తేదీన 'కొబ్బరి మొక్కలు తొలగించాలి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీవో ఆనంద్ మాట్లాడుతూ కాల్వ పూడికతీత సమయంలో ఇబ్బంది లేకుండా కాల్వ గట్టు అవతల వైపు ప్రస్తుతం తీసి వేసిన కొబ్బరి మొక్కలను నాటించామన్నారు. ఇకపై నీటి సరఫరాకు, పూడికతీతకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. నాటిన మొక్కలకు రక్షణ వలయం ఏర్పాటు చేస్తామన్నారు.

ఆలయ చెరువుల లీజు వేలం వాయిదా

ముదినేపల్లి, ఆగస్టు 5 : ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయానికి చెందిన మోటూరు గ్రామంలోని 111 ఎకరాల చేపల చెరువుల లీజు వేలం వాయిదా పడింది. సోమవారం మోటూరు గ్రామ సచివాలయం వద్ద దేవదాయ శాఖ అధికారులు నిర్వహించిన చెరువుల లీజు వేలంలో రైతులు పాల్గొన్నప్పటికీ ఎవరూ డిపాజిట్లు చెల్లించకపోవటంతో వేలంను వాయిదా వేసినట్టు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

ఆచంట ఎమ్మెల్యే పితాని సోదరుడి మృతి



పితాని సూర్యనారాయణ (ఫైల్)

పోడూరు, ఆగస్టు, 5 : ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు, ప్రముఖ లేస్ పారిశ్రామికవేత్త, విద్యా వేత్త పితాని సూర్యనారాయణ(76) ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సూర్యనారాయణ ఏయూ పాలకవర్గ సభ్యుడిగా, లేస్ ఎక్స్‌పోర్టర్‌గా, పెనుగొండ ఎస్‌వీకేపీ జూనియర్ కళాశాల చైర్మన్‌గా పని చేస్తున్నారు. హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే పితాని తన సోదరుడి మరణవార్త తెలియడంతో హుటాహుటిన స్వగృహానికి చేరుకుని సోదరుడి భౌతికకాయాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. సూర్యనారాయణ పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య నారాయణ అత్యంత సన్నిహితుడు తెలంగాణ రిటైర్డ్ సీఎస్ సోమేశ్ కుమార్ కొమ్ము చిక్కాల వచ్చి సూర్యనారాయణ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు సూర్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బందా కాంస్య విగ్రహావిష్కరణ



కైకలూరు, ఆగస్టు 5: సినీ, రంగస్థల నటుడు బందా కనక లింగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆటపాకలో సోమవారం ఆవిష్కరించారు. అట పాక కనక లింగేశ్వరస్వామి వంశపారంపర్య ధర్మకర్తలైన బందా కనకలింగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆయన మనవడు కృష్ణసాయి సిద్ధార్థ ఆవిష్కరించారు. కనకలింగేశ్వర రావు అటపాక గ్రామంలో జన్మించి సారంగధర, బాలనాగమ్మ, పాదుకా పట్టాభిషేకం సినిమాలతో పాటు ఆంధ్ర నాటక రంగ స్థలంపై విభిన్న పాత్రల్లో నటించారు. ఆయన గుర్తుగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. బందా వంశీకులు బందా గోపాలకృష్ణ గాంధీ, బందా సత్యనారాయణ, ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి యువత అధ్యక్షుడిగా వర్రె



ముదినేపల్లి, ఆగస్టు 5 : సినీ హీరో చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా చిగురుకోట గ్రామానికి చెందిన జనసేన నాయకుడు వర్రె హనుమాన్ ప్రసాద్ సోమవారం నియమితులయ్యారు. కైకలూరు నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్న ప్రసాద్ కొన్నేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిరంజీవి స్ఫూర్తితో మరిన్ని సేవలందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

గాల్లో ప్రాణాలు!

- శిథిలావస్థలో కోరుకొల్లు వంతెన
- పూర్తిగా ధ్వంసమైన రైలింగ్
- పెచ్చులూడిన స్లాబ్
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణం

కలిదిండి, ఆగస్టు 5 : కోరుకొల్లు సీబీ కెనాల్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలమైనా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. వంతెన స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. వంతెన కిరువైపులా రైలింగ్ విరిగి కిందకు వేలాడుతూ ఏ క్షణంలో కూలిపోతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన పక్కనే ఉన్న అయ్యప్పస్వామి గుడికి సమీప గ్రామాల నుంచి భక్తులు వస్తుంటారు. హైదరాబాద్, విజయవాడ, గుడివాడ, భీమవరం ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనకు ఇరువైపులా రైలింగ్ లేకపోవటంతో ఎదురెదురుగా వాహనాలు వస్తున్నప్పుడు పక్కకు తప్పుకోవటానికి వీలు లేక అదుపు తప్పి కెనాల్‌లో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. నూతన వంతెన నిర్మించాలని ఐదేళ్లుగా పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వంతెన ఒక వైపుకు కుంగిందని ఏ నిమిషంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా



సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈఈ వివరణ

ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈఈ విజయ శ్రీకర్‌ను వివరణ కోరగా, శాశ్వత వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయన్నారు. టెండర్లు పూర్తి కాగానే నూతన వంతెన నిర్మాణ పనులు చేపడతామన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలి

కైకలూరు, ఆగస్టు 5: రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేసి ప్రజా మన్ననలు పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో సమావేశ మందిరాన్ని ప్రారంభించి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా అభివృద్ధి చేసి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోయేలా పనిచేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయన్ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే పుస్తకాలు పంపిణీ చేశారు. కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కొల్లేరు గ్రామాల ప్రజలకు తాగునీరు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చటాకాయ్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్ స్కీం, కొట్టాడలో మైక్రో వాటర్ స్కీంలను, పైప్‌లైన్‌లను ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ళ బేబి, సర్పంచ్‌లు నవరత్నకుమారి, ఘంటశాల శేషారావు, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, వీరమల్లు నరసింహారావు, పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విన్నకోట రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కామినేని అన్నారు. సోమవారం సానారుద్రవరంలో రామకృష్ణ కుటుంబీకులను ఆయన పరామర్శించారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

కైకలూరు ఆగస్టు 5 : విద్యార్థులు సన్మార్గం వైపు పయనిస్తే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ కె. సుజాత అన్నారు. సోమవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు, పొగాకు వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువత మత్తుకు బానిసలు అవుతున్నారని 15 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థులు వీటి బారిన పడుతున్నారన్నారు. దీనివల్ల ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తే తక్షణమే అధ్యాపక బృందానికి, లేకుంటే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అధ్యాపక బృందం డాక్టర్ ఎం హరిప్రసాద్, ఇమ్మానియేలు, ఎం. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మూరులో ఉచిత వైద్యశిబిరం

ఎస్సీ, ఎస్టీలు చదువులో రాణించాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి రామకృష్ణయ్య

నూజివీడు, ఆగస్టు 5: ఆగిరిపల్లి మండలంలోని కొమ్మూరు గ్రామంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. కొమ్మూరుతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరానికి హాజరై వైద్యపరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులను తీసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి రామకృష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల యువత ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని చదువుల్లో రాణించి పారిశ్రామికవేత్తలుగా, ఇంజినీర్లు, డాక్టర్లుగా ఎదగాలని అభిలషించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు దాడులు, వేధింపులకు గురికావడం చూస్తున్నామన్నారు. ఇలాంటి కుటుంబాలకు హైకోర్టు ప్రత్యేకంగా న్యాయవాదులను ఏర్పాటుచేసి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. లోక్ అదాలత్ లక్ష్యం పేదలకు న్యాయం చేయటమే అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా కోర్టులు, చట్టాలపై పూర్తిగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, నూజివీడు కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

కలిదిండి, ఆగస్టు 5 : ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీని వర్తింపజేయాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చెరువులకు అనుమతుల మంజూరులో జాప్యం వల్ల ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తించకపోవటంతో పాటు బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. చేపలు, రొయ్యల చెరువులకు అనుమతుల విషయంలో నిబంధనలు సడలించాలన్నారు. మండలంలో 465 మంది రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తించకపోవటంతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఎకరానికి రూ.500 నీటి తీరువా చెల్లిస్తున్నప్పటికీ సాగునీరు సక్రమంగా అందించటం లేదన్నారు. సాగునీరు అందించి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో దినతేజ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పనులు చేశాం.. కూలి ఏదీ?



ఉపాధి పనులు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ఉపాధి వేతనాల కోసం కూలీల ఎదురుతెన్నులు

బడ్జెట్ రావాలంటున్న అధికారులు

ముదినేపల్లి, ఆగస్టు 5 : ఉపాధి కూలీలు మూడు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మే 15 నుంచి కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం వేతనాల బడ్జెట్‌ను విడుదల చేయకపోవటంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. మే 15 నుంచి జూలై నెలాఖరు వరకు చేసిన పనులకు వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా తగ్గిపోవటంతో ఉపాధి కూలీలకు ప్రత్యామ్నాయ పనుల్లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముదినేపల్లి మండలంలో ఉపాధి కూలీలకు రూ.18 లక్షల వేతనాల బడ్జెట్ విడుదల కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.



ఇబ్బందులు పడుతున్నాం

ఉపాధి పనుల వేతనాలు రెండు నెలలుగా అందటం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఏ పూటకా పూట గడుపుకునే మాకు చేతిలో చిల్లిగవ్వ లేక, కూలి పనులు లేక అల్లాడిపోతున్నాం.

-ఎం. ఏడుకొండలు, ఉపాధి కూలీ, బొమ్మినంపాడు



కూలి ఇచ్చి ఆదుకోండి

ఉపాధి పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నది. కూలి సొమ్ములు నేటికీ రాలేదు. పూట గడవటానికి ఇబ్బందిగా ఉంది. వెంటనే కూలి సొమ్ము ఇచ్చి ఆదుకోవాలి.

-యాళ్ల వినీల, ఉపాధి కూలీ, బొమ్మినంపాడు

విద్యాశాఖలో ఉద్యోగుల మధ్య వివాదం

చేయి కోసుకున్న ఉద్యోగి

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 : మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో-2)కి, మండల విద్యా శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగికి మధ్య నెలకొన్న వివాదంలో చిరుద్యోగి చేయి కోసుకున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఈవోతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ చిరుద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు కొంతకాలంగా వివాదం జరుగుతుంది. గత శనివారం నిర్వహించిన సీఆర్పీల సమావేశం సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో ఎంఈవోకు, చిరుద్యోగికి మధ్య సంవాదం నెలకొనడం, అదే సందర్భంలో కార్యాలయంలోకి వెళ్ళిన ఉద్యోగి తన చేతిని కోసుకోవడంతో గాయాలపాలయ్యాడు. అప్రమత్తమైన ఎంఈవో రక్తస్రావంతోవున్న ఉద్యోగిని ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స చేయించారు. చేతికైన గాయానికి కుట్లు వేశారు. ఈ వివాదం కాస్తా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు తీసుకెళ్ళడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత ఉద్యోగిని మరోచోటకు బదిలీచేయడంగాని లేదా తనను బదిలీచేయడంగాని ఏదోఒకటి చేయాలని అభ్యర్థిస్తూ సోమవారం ఏలూరు మండల ఎంఈవోలిద్దరూ, కార్యాలయ సిబ్బందితోసహా తరలివచ్చి డీఈవో అబ్రహంను అభ్యర్థించారు. ఇటువంటి వివాదాస్పద ఉద్యోగులతో తాము పని చేయించుకోలేమని, భవిష్యత్తులో ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే బాధ్యులెవరతారని డీఈవోకు నివేదించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ వివాదం ఉపాధ్యాయవర్గాల్లో హాట్ టాపిక్‌గా నడుస్తోంది.





కొవ్వాడలంక, చాట్రాయి అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తల్లిపాలు అమృతంతో సమానం

మండవల్లి ఆగస్టు 5: తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట నాగలక్ష్మి అన్నారు. సోమవారం కొవ్వాడలంక, మణుగులూరు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భవతులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి సాయిదుర్గ, ఏఎన్ఎం నాగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు రజని, ప్రభావతి, రాణి, ఎంఎస్‌కె సంగీత వాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: తల్లి పాలు శిశువులకు అమృతంతో సమానమని అంగన్వాడీ సూపర్‌వైజర్ గాయత్రిదేవి అన్నారు. చాట్రాయి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన తల్లి పాల వారోత్సవాలలో ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టిన అర గంటలో తల్లి పాలు ఇస్తే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. బాలింతలు, గర్భిణులు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు తహసీల్దార్‌గా రాజ్‌కుమార్



ముసునూరు, ఆగస్టు 5: ముసునూరు మండల తహసీల్దార్‌గా కె.రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా పెదపూడి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజ్‌కుమార్‌ను ఇక్కడ నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కుమార్‌కు డిప్యూటీ తహసీల్దార్ ఎమిలికుమారి, సీనియర్ అసిస్టెంట్ రవీంద్రరెడ్డి, రీసర్వే డీటీ శర్మ, జూనియర్ అసిస్టెంట్ రమేష్, వీఆర్వోలు మస్తాన్‌రావు, నవీన్‌కుమార్, సురేష్, హరిబాబు తదితరులు అరుదైన మొక్కలను అందజేసి అభినందనలు తెలిపారు. మండల ప్రజలకు రెవిన్యూ పరంగా ఉత్తమ సేవలు అందించేలా కృషి చేస్తానని రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా రాజమహేంద్రవరం నుంచి ముసునూరు తహసీల్దార్‌గా వచ్చిన జవహర్ బాజి ఇటీవల బదిలీ అయ్యారు.

కైకలూరు తహసీల్దార్‌గా ఉదయ భాస్కరరావు



కైకలూరు ఆగస్టు 5: కైకలూరు తహసీల్దార్‌గా మాచిరాజు ఉదయ భాస్కరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై కైకలూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహిం చి ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

ముదినేపల్లి తహసీల్దార్‌గా సుబాని



ముదినేపల్లి, ఆగస్టు 5: ముదినేపల్లి మండల తహసీల్దార్‌గా జేఎస్ సుబాని నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రి సెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. మండవల్లి మండలం నుంచి ఆయనను ముదినేపల్లి బదిలీ చేశారు. ఇక్కడి తహసీల్దార్ కుమారి కాకినాడ జిల్లాకు బదిలీ కావటంతో ముదినేపల్లి తహసీల్దార్‌గా సుబాని నియమితులయ్యారు.

పదోన్నతిపై పంచాయతీ కార్యదర్శుల బదిలీ



రమేష్, శ్యామ్ సుందర్

ముదినేపల్లి, ఆగస్టు 5 : మండలంలోని వడాలి, పెయ్యేరు పంచాయతీల గ్రేడ్-3 కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా ప్రమోషన్ లభించింది. దీంతో వడాలి పంచాయతీ కార్యదర్శి జి.రమేష్‌ను గుడివాడ రూరల్ మండలం శేరిగొల్వేపల్లి పంచాయతీకి పెయ్యేరు పంచాయతీ కార్యదర్శి వై.శ్యామ్ సుందర్‌ను బంటుమిల్లి మండలం సాతులూరు పంచాయతీకి బదిలీ చేస్తూ కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



నూజివీడు టౌన్, ఆగస్టు 5: విద్యార్థుల బాల్యాన్ని చిదిమేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి జి.అఖిల్ కోరారు. సోమ వారం విద్యార్థి సంఘాల నాయకులు ఆర్డీవో భవానీ శంకరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు రెవెన్యూ డివిజన్‌లోని అనేక కార్పొరేట్ విద్యా సంస్థలు ఉదయం 9.30కు ప్రారంభం కావాల్సిన తరగతులను ఉదయం 8 గంటలకే ప్రారంభిస్తున్నారని, దూర ప్రాంతాల వారైతే ఉదయం 7 గంటలకే బస్సుల్లో ఎక్కించి సాయంత్రం 6 గంటల వరకు క్లాసుల్లో ఉంచి పిల్లలను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అలాంటి యాజమాన్యాలపై తక్షణం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని ఆయన వినతిపత్రంలో డిమాండ్ చేశారు. అధ్యక్షుడు వెంకట్, నాయకులు శ్రీను, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండయ్య గారి సత్రాన్ని పునర్నిర్మించాలి



నూజివీడు టౌన్, ఆగస్టు 5: శిథిలావస్థలో ఉన్న నూజివీడు కొండయ్య గారి సత్రాన్ని పునర్నిర్మించాలని బీజేపీ సీనియర్ నాయకుడు వై.ఎస్. దొరై కోరారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో దుర్గా ప్రసాద్, రీ సర్వే డీటీ రాజేంద్రకు ఆయన వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతూ అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల తరఫు బంధువులు సేద తీరేందుకు ఈ సత్రాన్ని వినియోగించుకునే వారని అయితే దానిని ఎండోమెంట్ వారు స్వాధీనం చేసుకొని వ్యాపార సంస్థలకు అద్దెకు ఇవ్వడం ప్రారంభించారని ఇప్పుడది శిథిలావస్థకు చేరిందన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉన్న సత్రాన్ని కూల్చి దాని స్థానంలో నూతన నిర్మాణం చేపట్టాలని కోరారు.



బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ముసునూరు, ఆగస్టు 5: బాలికలు వ్యక్తిగత శుభ్రతతోపాటు ఆరోగ్య సూత్రాలను పాటించాలని ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి సూచించారు. సోమవారం ఎస్సీ హాస్టల్‌లో బాలికలకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. వంటగదిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలికలకు విష జ్వరాలు లేవని, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు మాత్రమే ఉన్నాయని, వీటికి సంబంధించిన పరీక్షలు చేసి, మందులు ఇవ్వడం జరిగిందన్నారు. నెలరోజులుపాటు వర్షాలు కురిసి, ప్రస్తుతం ఎండలు కాయడం వల్ల సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తలనొప్పి, ఒంటి నొప్పులు, విరేచనాలు, కడుపునొప్పి ఉంటే వెంటనే వార్డెన్‌కు చెప్పి, ఆసుపత్రిలో వైద్యులతో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని చెప్పారు.

సీపీఐ నూజివీడు ఏరియా కార్యదర్శి బత్తుల మృతి



నూజివీడు టౌన్, ఆగస్టు 5: సీపీఐ నూజివీడు నియోజక వర్గ కార్యదర్శి, ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల వెంకటేశ్వరరావు (55) సోమవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం దిగవల్లిలో సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురి కావడంతో ఆయన్ను అంబులెన్స్‌లో విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. ఆయన మృతి పట్ల నూజివీడు ఏరియా కమ్యూనిస్టు సమితి ఏలూరు జిల్లా సమితిలు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపాయి. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

భోజన ప్లేట్ల వితరణ



చాట్రాయి, ఆగస్టు 5: చాట్రాయి జడ్పీ హైస్కూల్ విద్యార్థుల మధ్యాహ్న భోజనం నిమిత్తం జనార్ధనవరానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు మాదాసు జగదీష్, కృష్ణప్రసన్న 50 ప్లేట్లను సోమవారం అందజేశారు. హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, చంటిబాబు, మోహనరావు పాల్గొన్నారు.